క్లుప్తంగా

బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు



దేవరమడుగులులో తనిఖీలు చేస్తున్న బాంబుస్క్వాడ్, పోలీసు జాగిలాలు

వై.రామవరం: వై.రామవరం, అడ్డతీగల ప్రధాన రహదారిలో ల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్‌ఐ ఎం.సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం పోలీసు జాగిలాల సహాయంతో బాంబు స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ మార్గంలో అనుమానస్పద ప్రదేశాలను, కల్వర్టులను తనిఖీ చేశారు. వాహనచోదకుల రికార్డులు పరిశీలించారు. అనుమానస్పద వ్యక్తుల వివరాలు సేకరించారు. సీఆర్‌పీఎఫ్ డి–42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్ నాయుడు, సిబ్బంది, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

కూనవరం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ చెప్పారు. టేకులబోరు గ్రామంలో ఆయన శనివారం ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగవద్దని, రానున్న ఎన్నికల్లో ధైర్యంగా ఓటు వేయాలని సూచించారు. అనంతరం గ్రామస్తులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నీరు,మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఎండలో బయటకు వచ్చినపుడు టోపీలు ధరించాలని సూచించారు.

హుకుంపేటలో భారీ వర్షం



హుకుంపేటలో కురుస్తున్న వర్షం

హుకుంపేట: మండల కేంద్రంలో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో సంతబజారు,సెంటర్, పలు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. వారపు సంత కావడంతో సంతకు వచ్చిన మారుమూల గిరిజనులు కొంతసేపు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



రేఖపల్లిలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

వీఆర్ పురం: ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రేఖపల్లి పీహెచ్‌సీ వద్ద శనివారం చలివేంద్రాన్ని ఆ సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరుగుతున్నందున ప్రజల దాహార్తిని తీర్చాలనే సదుద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. సిబ్బంది సుబ్రహ్మణ్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



కాలిపోయిన సామగ్రి

వీఆర్ పురం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇంట్లోని రిఫ్రిజిరేటర్, ఇతర గృహోపకరణాలు కాలిపోయిన ఘటన మండల పరిధిలోని కిష్టారం గ్రామంలోని పాయం రాముడు ఇంట్లో శనివారం చోటు చేసుకుంది. ఇంటి వరండాలో అందరూ నిద్రిస్తుండగా గది లోపల ఈ సంఘటన చోటు చేసుకోవడంతో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ఇంటి యజమాని చెప్పారు. ప్రమాద ప్రదేశాన్ని వీఆర్వో ఎడ్ల దినేష్ పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. నష్టం విలువ రూ.40 వేలు వరకు ఉంటుందని ఆయన చెప్పారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులకు 25 కిలోల బియ్యం తక్షణ సహాయం కింద అందజేసినట్టు తెలిపారు.

జగనన్న చెప్పారంటే..చేస్తారు

- వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోపై హర్షాతిరేకాలు
- బడుగు, బలహీనవర్గాలకు అనుగుణంగా ఉందని కితాబు
- సీఎం జనరంజక పాలనకు అది తార్కాణమని ప్రజల వెల్లడి

మేనిఫెస్టో అంటే పవిత్ర గ్రంథం...చెప్పింది చేశాం...చేసేదే చెబుతాం...చంద్రబాబు వలే బూటకపు హామీలు ఇవ్వం...అని చెబుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, పేదలకు ఇళ్లు, మహిళా సంక్షేమం, సామాజిక భద్రతే ప్రధాన అంశాలుగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి నవరత్నాలు పేరుతో అందించిన సంక్షేమ పథకాలను కొనసాగించడంతో పాటు పలు పథకాల ద్వారా మరింత లబ్ధి చేకూరుస్తూ ఇచ్చిన మేనిఫెస్టో పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. మేనిఫెస్టోను పవిత్రంగా భావించే జగనన్న చెప్పాడంటే.. చేస్తాడంతే అని సర్వత్రా నమ్మకంగా చెబుతున్నారు. గతంలో ఇచ్చిన వాటి కంటే మెరుగైన సంక్షేమం ప్రస్తుత మేనిఫెస్టోలో ప్రకటనపై అన్ని వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.



సీఎం జగన్ మేనిఫెస్టో ప్రసంగాన్ని తిలకిస్తున్న ముంచంగిపుట్టులోని ఓ గిరిజన కుటుంబం

జగనన్న చెప్పింది చేస్తారు



జగనన్న మేనిఫెస్టోపై నాకు నమ్మకం ఉంది. చంద్రబాబుది మోసపూరిత, అబద్ధపు మేనిఫెస్టో. చంద్రబాబు మహిళా సంఘాలకు ఎన్నికల హామీ ఇచ్చి మోసగించిన సొమ్మును జగనన్న అధికారంలోకి వచ్చాక మాట తప్పకుండా ఇచ్చారు. నాకు లక్ష రూపాయలు పైగా వైఎస్సార్ ఆసరా సొమ్మును జగనన్న ఇచ్చారు. ఆ సొమ్ముతో షాపు పెట్టుకుని జీవిస్తున్నాను. జగనన్న సాయంతో నేను మాకుటుంబం హాయిగా జీవిస్తున్నాం. చంద్రబాబు బూటకపు హామీలను నమ్మకండి. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే పేదలకు మంచి జరగుతుంది.
–ముర్ల వెంకటరత్నం, వై.రామవరం గ్రామం

అమ్మఒడి పెంపు హర్షణీయం



జగనన్న 2019లోని ఇచ్చిన మేనిఫెస్టో అమలుచేయడంలో వెనుకాడలేదు. ఆర్థిక సమస్యలు ఎదురైనా ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చి, మహిళలకు మరింత మంచిచేశారు. అమ్మఒడి పూర్తిస్థాయిలో అందుకున్నాను. ఈసారి అమ్మ ఒడి ఏడాదికి రూ.17వేలు అందిస్తాననడం చాలా సంతోషంగా ఉంది. జగనన్న చెబితే చెస్తాడని నమ్మకం నాకు ఉంది.
– మామిడి రాజేశ్వరి, అనంతగిరి

జగనన్న మేనిఫెస్టో బాగుంది



చెప్పిందే చేస్తామని సీఎం జగన్మోహన్‌రెడ్డి తయారు చేసిన మ్యానిఫేస్టో బాగుంది. పింఛన్లు రూ.3,500 పెంచండ, అదే విధంగా అమ్మఒడి పెంపు ఆనందంగా ఉంది. ఇతర పథకాలన్నీ కొనసాగిస్తామన్నారు. సీఎం జగన్ చెప్పింది అమలుచేస్తారు. చంద్రబాబు మోసపూరిత హామీలతో మోసం చేస్తున్నాడు.జగనన్నపై ప్రజలకు నమ్మకం ఉంది. మహిళల ఉపాధికి చేయూత ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడం అభినందనీయం.
– ఎస్.బంగారామ్మ, బూదరాళ్ల, కొయ్యూరు మండలం

అందరికీ మేలు చేశారు



సీఎం జగనన్న పాలనలో అందరికి మేలు జరిగింది. పారదర్శకంగా అందరికీ పథకాలు అందజేశారు.ఆయన గతంలో ప్రకటించిన నవరత్నాల పథకాలన్నీ అమలయ్యాయి. ఇప్పుడు కూడా అందరికీ మేలు చేసే విధంగా అమలు జరిగే హామీలను మాత్రమే ఇచ్చారు. రైతు భరోసా నుంచి అమ్మఒడి వరకు అన్ని అమలు చేశారు. జగనన్న మళ్లీ అధికారంలోకి వచ్చి హామీలన్నీ పూర్తిగా అమలు చేస్తారని నమ్ముతున్నాం.
– ఎస్ రమణమ్మ, బూదరాళ్ల

అందరికీ ఆమోదయోగ్యంగా జగనన్న మేనిఫెస్టో



గతంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వని, చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారు. చంద్రబాబు గంటకోమాట, పూటకో నిర్ణయంతో ఇబ్బందులు తలెత్తేవి. జగన్నన్న మాట ఇస్తే మడమ తిప్పని వ్యక్తి. అవినీతి రహిత పాలన అందించారు. మేనిఫెస్టోలో పథకాలు మెరుగులు దిద్ది అందించడం అందరికీ అమోదయోగ్యంగా ఉంది.
– కిల్లో సుబ్బారావు, రైతు, పినగరువు గ్రామం, జి.మాడుగుల

చంద్రబాబువి అమలుకాని హామీలు



గతంలో చంద్రబాబు ప్రకటించిన ఒక్క హామీని అమలుచేసిన దాఖాలాలు లేవు. చంద్రబాబువి అబద్ధపు ప్రకటనలు. నేడు సీఎం జగనన్న ప్రకటించిన మెనిఫెస్టోతో పేదలకు మరింత మేలు జరుగుతుంది. అమ్మ ఒడి, సామాజిక పింఛన్, అమ్మఒడి పెంపు ప్రకటన హర్షణీయం. అన్ని పథకాల అమలుతో పేదలందరికీ మరింత మంచి జరుగుతుంది. జగనన్న పాలనలోనే పేదల అభ్యున్నతి సాధ్యమైంది.**– కిల్లో రామారావు ,** చింతపల్లి మండలం,ఎర్రబొమ్మల గ్రామం.

చంద్రబాబువి బూటకపు హామీలు



గతంలో జగనన్న మేనిఫెస్టోలో ప్రకటించిన నవరత్న పథకాల్లో భాగంగా అన్ని పథకాలు అమలుచేయడంతో అన్ని వర్గాలు లబ్ధిపొందారు. సంక్షేమ పపథకాలతో పాటు గిరిజన ప్రాంతంలో ప్రత్యేకంగా గిరిజనులకు అటవీ హక్కుల పత్రాలు ప్రభుత్వం మంజురు చేసింది. దీంతో వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందాం. చంద్రబాబు గతంలో ఒక్క హామీ అమలుచేయలేదు. ఇప్పుడు ప్రకటిస్తున్నవన్నీ కూడా బూటకపు హామీలు.
– పాంగి రాంబాబు, బొడ్డాపుట్టు గ్రామం, హుకుంపేట మండలం

పింఛన్ పెంచడం హర్షణీయం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాకు వైఎస్సార్ పింఛనుతో పాటు చేయూత అందుతోంది. ఇప్పటికే అన్న మాట ప్రకారం రూ 3 వేలు పింఛను ఇస్తున్న వైఎస్ జగన్ ఆ సొమ్మును రూ 3,500కు పెంచడం హర్షణీయం. మూడేళ్ల అనంతరం రెండు విడతలుగా పెంచి ఇస్తానన్న వైఎస్ జగన్‌పై మాకు పూర్తి నమ్మకముంది.
–ముచ్చిక రాములమ్మ, వృద్ధురాలు, మామిళ్లగూడెం, చింతూరు మండలం

జగనన్న మేనిఫెస్టోలో నిజాయితీ ఉంది



జగనన్న చేయగలిగిందే చెప్పారు. ఒకసారి చెప్పితే ఖచ్చితంగా అమలు చేస్తారు. చంద్రబాబు లాగా భ్రమలు కల్పించరు. అమలు చేయలేనివి ఎన్నైనా చెప్పే అలవాటు చంద్రబాబుకు మాత్రమే ఉంది. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో గత పథకాలు అమలుచేస్తానని చెప్పడమే కాక ప్రతీ పథకాన్ని గతం కంటే మెరుగ్గా పెంచారు. చాలా ఆనందంగా ఉంది. **– చిలకా దుర్గమ్మ,** కూనవరం

మాట మీద నిలబడే వ్యక్తి జగన్



మాటిస్తే దానిని తూచా తప్పకుండా పాటించే వ్యక్తి వైఎస్ జగన్. ప్రస్తుత ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోను మరోసారి వందకు వందశాతం అమలు చేస్తారనే నమ్మకం మాకుంది. అందుకే ఈసారి కూడా వైఎస్ జగన్‌కు అండగా నిలబడతాం.
–సవలం రాజమ్మ, చూటూరు, చింతూరు మండలం

అభాగ్యులను ఆదుకునేది జగనన్నే



గతంలో అందించిన చేయూత నగదుతో చిన్న దుకాణం పెట్టుకున్నా. ఇప్పుడు అదే మొత్తాన్ని రూ.లక్షకు పెంచుతామని ప్రకటించారు.నిజంగా ఇలా చేయడం మాలాంటి అభాగ్యులకు ఆసరా దొరికినట్టే. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలి. ఆయన పది కాలాలపాటు చల్లంగా ఉండాలి.
పాయకంటి రమణమ్మ, డ్వాక్రా మహిళ, రాజవొమ్మంగి

అమలు చేసేవే జగనన్న ప్రకటిస్తారు



జగనన్న అమలుకు ఆమోదయోగ్యమైన వాటినే ప్రకటిస్తారు. తాజాగా ఆయన ప్రకటించిన మెనిఫెస్టో పేదలకు మరింత సంక్షేమాన్ని అందించేలా ఉంది. 2014లో చంద్రబాబు ఎన్నో హామీలను ప్రకటించి అధికారం చేతికి వచ్చాకా వాటి అమలును మాత్రం పట్టించుకోలేదు.కానీ జగనన్న 2019 ఎన్నికల్లో ప్రకటించిన నవరత్నాలతో పాటు ప్రకటించని మరెన్నో హామీలను కూడా ఆయన అమలు చేశాడు. గతంలో మాదిరిగానే ప్రస్తుతం ప్రకటించిన హామీలను ఆయన మళ్లీ అధికారంలోకి వచ్చిన అమలు చేస్తారని భావిస్తున్నాను **– వద్దానపు సాయిరామ్,** వీఆర్ పురం

గ్రామాల్లో ఇటుకల పండగ

ముంచంగిపుట్టు: మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఇటుకల పండుగ సందడి నెలకొంది. మగవారంతా వేట కోసం కొండ, ఆటవీ బాట పట్టగా, మహిళలంతా గ్రామాలకు వచ్చే దారి పొడవునా కర్రలు, తాడులు అడ్డుపెట్టి తాచేరు(చందా) వసూలు చేస్తున్నారు. గిరిజనులు సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం శంకుదేవునికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని ఏనుగురాయి, వనభోసింగి, చోటముక్కిపుట్టు, కొండపడ, లుంగాపుట్టు, కిలగాడ, కొత్తురు, పొలిపుట్టు, పనసపుట్టు, ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సందడి నెలకొంది.



ముంచంగిపుట్టులో తాచేరు వసూలు చేస్తున్న గిరిజన మహిళలు

డబ్బులు ఇచ్చిన వారిని విడిచి పెడుతూ ఇవ్వని వారిపై నీళ్ల పోస్తూ ఇటుకల పండుగను గిరిజనులు ఎంతో సంబరంగా జరుపుకుంటున్నారు.

జోరంగి ప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటు





ప్రసాద్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పాడేరు అసెంబ్లీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నేతలు

గూడెంకొత్తవీధి: వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసిన సీనియర్ నాయకులు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జోరంగి ప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటని పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అన్నారు. మండలంలో సిరిబాలకు చెందిన నాయకుడు ప్రసాద్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వారు సిరిబాల గ్రామానికి వచ్చి ప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ప్రసాద్ అందించిన సేవలు మరువలేనవన్నారు. పార్టీ ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. ఎంపీపీ బోయిన కుమారి, చింతపల్లి, మండల పార్టీ అధ్యక్షులు మోరి రవి, బొబ్బిలి లక్ష్మణ్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌లు కాసులమ్మ, రామకృష్ణ, ఎంపీటీసీలు నాగమణి, కాసులమ్మ, నేత గిరిప్రసాద్, అరుణ్‌కుమార్, రమేష్ తదితరులున్నారు.

నేడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

డుంబ్రిగుడ (అరకులోయటౌన్): మండలంలోని కొర్రా, కితలంగి, కించుమండ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరరావు తెలిపారు. ప్రజాప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ ప్రచారం

వై.రామవరం: మండలంలోని శనగనూరు, పాతకోట, ఊట్లబంద, కానివాడ గ్రామాల్లో ఆదివారం నిర్వహించే ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొంటారని ఎంపీపీ కడబాల ఆనందరావు తెలియజేశారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



గంగవరం సెంటర్‌లో వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

గంగవరం : మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల గంగవరం–అడ్డతీగల, గంగవరం –రంపచోడవరం మార్గంలో ఎస్‌ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల రికార్డులు పరిశీలించారు. అనుమానస్పద వ్యక్తుల వివరాలు సేకరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ఎటపాక: మండలంలోని చోడవరం గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితుడు ముదిగొండ వెంకటేశ్వర్లు కుటుంబానికి దాతలు శనివారం సాయమందించారు. గ్రామ సచివాలయం నుంచి 30 కిలోల బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలను వీఆర్వో అందజేశారు. అదే విధంగా నాయకులు వెంకట్, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాధితులకు బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. సర్పంచ్ మణి, రాంప్రసాద్, రమేష్, సర్వేశ్వరరావు, రాంబాబు, శంకర్ తదితరులున్నారు.



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

53 మందికి వైద్య పరీక్షలు

రాజవొమ్మంగి: మండలంలోని ఓకుర్తి, ఓగిపాలెం గ్రామాల్లో శనివారం జరిగిన ఫ్యామిలి డాక్టర్ ఉచిత వైద్యశిబిరంలో 53 మందికి చికిత్స లభించింది. జడ్డంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ యామినిప్రియ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. సుగర్ సమస్య ఉన్న ఆరుగురికి, బీపీ ఉన్న 8 మందిని పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. ఈ శిబిరానికి 11 మంది గర్భిణులు, బాలింతలను పరీక్షించి ఆరోగ్యసూత్రాలు వివరించారు. హెచ్‌వి చిన్నయమ్మ, ఎంపీహెచ్‌ఏ శామ్యూల్, లీలావతి, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి, ఆశ లోవకుమారి పాల్గొన్నారు.



ఓకుర్తిలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ యామినిప్రియ

మలేరియా నివారణకు చర్యలు

రాజవొమ్మంగి: మలేరియా దోమల నివారణ చర్యల్లో భాగంగా మండలంలోని అనంతగిరి గ్రామంలో శనివారం నాటికి 139 గ్రామాల్లో పిచికారీ పనులు పూర్తి చేసినట్లు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. ప్రజలు దోమలు పెరిగిపోకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రభుత్వం సరఫరా చేసిన దోమతెరలు ఉపయోగించాలని, ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తపడాలని కోరారు. సీహెచ్‌ఓ కృపాచార్యులు, ఎంటీఎస్. సోమరాజు, ఎంఎల్‌హెచ్‌పీ భాగ్యలక్ష్మి, ఎంపీహెచ్‌ఏ వరహాలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



అనంతగిరిలో దోమల మందు పిచికారీ పనులు చేపట్టిన సిబ్బందితో అధికారులు

ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం పెద్దపీట



దోమలుజోరులో ప్రచారం చేస్తున్న నాయకులు



కితలంగిలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ సుబ్బారావు నాయకులు



దాలిగుమ్మడిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ రాజుబాబు, పార్టీ శ్రేణులు



సింధిపుట్టులో ప్రచారం చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు, నేతలు



పెదరాయిలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ మాలన్న, ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజు తండ్రి పెంటంరాజు, నేతలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలయ్య, పక్కన ఎంపీపీ అనూషదేవి, నాయకులు



జోడిమామిడిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

అరకులోయ రూరల్/డుంబ్రిగుడ (అరకులోయటౌన్)/ముంచంగిపుట్టు/హుకుంపేట: రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారాలు జోరందుకున్నాయి. అరకులోయ, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, హుకుంపేట, మండలాల్లో పార్టీ ప్రజాప్రతినిధులు శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను గెలిపించాలని కోరారు. అరకులోయలో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు ఆనంద్‌కుమార్, రాంచంద్, డుంబ్రిగుడలో కితలంగి సర్పంచ్ సుబ్బారావు, మండల పార్టీ కార్యదర్శి సింహాచలం, కన్వీనర్ మోహన్, పార్టీ ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, ముంచంగిపుట్టులో మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు, సర్పంచ్ పార్వతమ్మ, ఉప సర్పంచ్ సాధురాం, హుకుంపేటలో ఎంపీపీ కూడా రాజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కొండలరావు, సర్పంచ్‌లు వెంకటపూర్ణిమ, బొంజుబాబు, రమేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు చిన్నబ్బి, నాయకులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్(హుకుంపేట)/జి.మాడుగుల/చింతపల్లి రూరల్: జి.మాడుగుల, చింతపల్లి, పాడేరు మండలాల్లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో పార్టీ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజును గెలిపించాలని అభ్యర్థించారు. పాడేరులో సర్పంచ్ చిట్టిబాబు, జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి నరసింహామూర్తి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రాజారావు, జి.మాడుగులలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్‌లు మాలన్న, ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజు తండ్రి మత్స్యరాస పెంటంరాజు, నాయకులు బ్రహ్మలింగం, రాంబాబు, చింతపల్లిలో జెడ్పీటీసీ సభ్యుడు పోతరాజు బాలయ్య, ఎంపీపీ అనూషదేవి, మండల పార్టీ అధ్యక్షుడు రవి, సర్పంచ్ పుష్పలత, వైస్ ఎంపీపీ వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల ప్రచారం

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగిలో వారపు సంతరోజు శనివారం ఎన్నికల ప్రచారం హోరెత్తింది. సీపీఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.



సంతలో సీపీఎం నేతల ప్రచారం